తమిళనాడుపై కేంద్రం కక్ష సాధింపు

రూ.2,152 కోట్లు నిధులు రాకుండా చేసింది: సీఎం స్టాలిన్

చెన్నై: తమిళనాడు రాష్ట్రంపై కేంద్రం లోని మోదీ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ ఆరోపించారు. జాతీయ విద్యా విధానం, త్రి భాషా విధానాల్ని తిరస్కరించినప్పటి నుంచి కేంద్రం తమపై బహిరంగ బెదిరింపులకు దిగుతున్నదని, రాష్ట్రానికి రావాల్సిన రూ.2,152 కోట్ల నిధులను వేరే రాష్ట్రాలకు తరలించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఈ సందేశాన్ని పోస్ట్ చేశారు. 'కేంద్రం తమిళనాడు విద్యార్థులకు రావాల్సిన రూ.2,152 కోట్లు రాకుండా అడ్డుకున్నది. రాజకీయ ప్రతీకారం కోసం కేంద్రంలో ఏ ప్రభుత్వమూ ఇప్పటివరకు ఇలా చేయలేదు' అని స్టాలిన్ అన్నారు.

ట్రంప్ ఆసనంలో మస్క్!

బ్యూరోక్రసీ ప్రక్షాళనపై 'టైమ్' కవర్ పేజీ కథనం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుని కార్యాలయంలోని రిసొల్యూట్ డెస్క్(అధ్యక్షుడు కూర్చునే స్థానం)లో ఆశీనుడై ఉన్న టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ ఫోటోతో వెలువడిన టైమ్ మ్యాగజైన్ తాజా సంచిక కలకలం సృష్టించింది. కవర్ పేజీ స్టోరీలో ఇన్‌సైడ్ ఎలాన్ మస్క్ వార్ ఆన్ వాషింగ్టన్(వాషింగ్టన్‌పై మస్క్ యుద్ధం వెనుక) అనే శీర్షికతో ఈ కథనాన్ని ప్రచురించింది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఫెడరల్ ప్రభుత్వాన్ని ప్రక్షాళన చేసేందుకు మస్క్ సాగిస్తున్న కృషిని ఈ కథనంలో పత్రిక ప్రధానంగా పేర్కొంది. బ్యూరోక్రసీని ప్రక్షాళన చేసే లక్ష్యంగా ఏర్పడిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)కి మస్క్ సారథ్యం వహిస్తున్నారు. ఈ కథనాన్ని ట్రంప్ ఎద్దేవా చేశారు.

బంగ్లా సరిహద్దులో మళ్లీ అనుమానాస్పద సిగ్నళ్లు

కోల్‌కతా: భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని దక్షిణ బెంగాల్ ప్రాంతంలో అనుమానాస్పద హ్యామ్ రేడియో సిగ్నళ్లు రెండు నెలల నుంచి వస్తున్నట్లు అమెచ్యూర్ హ్యామ్ రేడియో ఆపరేటర్లు గుర్తించారు. బెంగాలీ, ఉర్దూ, అరబిక్ భాషల్లో రహస్య సంకేత భాషలో ఈ సిగ్నల్స్ ఉన్నట్లు తెలిపారు. ఇవి స్మగ్లింగ్, తీవ్రవాద కార్యకలాపాలకు సంబంధించినవి అయి ఉండవచ్చునని అధికారులు చెప్పారు. ఈ సిగ్నల్స్ రాత్రి 1-3 గంటల మధ్య వచ్చాయని వారు తెలిపారు. నిరుడు డిసెంబర్‌లో మొదటిసారిగా ఈ సిగ్నల్స్ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఈ ఆపరేటర్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖకు తెలిపారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక కార్యకలాపాలు, భారత వ్యతిరేకత కొనసాగుతున్న సమయంలో ఈ పరిణామాలు జరగడం గమనార్హం.

బంగ్లాదేశ్‌లో 'ఆపరేషన్ డెవిల్ హంట్'

హసీనా విధేయులపై ప్రభుత్వం ఉక్కుపాదం

ఢాకా:మాజీ ప్రధాని షేక్ హసీనా విధేయులపై ఉక్కుపాదం మోపుతూ బంగ్లాదేశ్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వం భద్రతా ఆపరేషన్ చేపట్టింది. దీన్ని ఆపరేషన్ డెవిల్ హంట్‌గా ఆ దేశ అంతర్గత వ్యవహారాల శాఖ అధిపతి జహంగీర్ ఆలం చౌదరి అభివర్ణించారు. గత ఏడాది ఉద్యమాన్ని రగిల్చిన స్టూడెంట్స్ ఎగెనెస్ట్ డిస్క్రిమినేషన్‌కు చెందిన విద్యార్థులపై ఢాకా జిల్లాలోని గాజీపూర్‌లో దాడి జరిగింది. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆపద్ధర్మ ప్రభుత్వంలో ఉన్న గ్రూపు సభ్యులు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం ఆపరేషన్ డెవిల్ హంట్ చేపట్టినట్టు ప్రకటించింది.

ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల విచారణ వేగవంతం చేయండి

సుప్రీంకోర్టులో పిల్

న్యూఢిల్లీ: పార్లమెంటు, శాసనసభల సభ్యులపై నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయాలని కోర్టులను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. వీరిపై దాదాపు 5,000 కేసులు వేర్వేరు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తుపై వారి ప్రభావం చాలా ఉంటున్నదని, విచారణ జరగనివ్వడం లేదని పేర్కొంది. సుప్రీంకోర్టు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ, హైకోర్టులు పర్యవేక్షిస్తున్నప్పటికీ, వీరిపై కేసులు పెండింగ్‌లోనే ఉంటుండటం మన దేశ ప్రజాస్వామిక వ్యవస్థకు కళంకమని పేర్కొంది.

31 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

తుపాకుల మోతతో దద్దరిల్లిన ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం

- బీజాపూర్‌లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య భీకర కాల్పులు
- నక్సల్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం సందర్భంగా ఘటన
- మృతుల్లో తెలంగాణ క్యాడర్ నేతలు బండి ప్రకాశ్, భాస్కర్
- ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి.. మరో ఇద్దరికి గాయాలు

ముంబై/ కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి తుపాకులు గర్జించాయి. బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా, ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. ఈ ఆపరేషన్‌లో వెయ్యి మందికి పైగా భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్‌కు చెందిన ఇద్దరు జవాన్లు నక్సల్స్ కాల్పుల్లో మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇప్పటి వరకు 12 మంది నక్సలైట్ల మృతదేహాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలం నుంచి పెద్దయెత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ లోని ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో నక్సలైట్ల కోసం ఇంకా గాలింపు కొనసాగుతున్నది.

పక్కా సమాచారంతోనే...

బీజాపూర్ జిల్లా ఫర్సేఘఢ్ ఇలాకాలో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో జిల్లా రిజర్వ్ గార్డు(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్టీఎఫ్), బస్తర్ ఫైటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయం నేషనల్ పార్క్ ఏరియాలోని అటవీ ప్రాంతంలో వారికి మావోయిస్టులు తారసపడ్డారు. వెంటనే మావోయిస్టులు జవాన్లపై కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన జవాన్లు మావోయిస్టులపై ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య సుమారు మూడు-నాలుగు సార్లు విడతల వారీగా కాల్పులు జరిగాయి. భద్రతా దళాల ధాటికి తాళలేక కాల్పులు జరుపుతూనే మావోయిస్టులు అక్కడి నుంచి అడవిలోకి పారిపోయారు. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన 31మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఏకే-47, ఎస్ఎల్ఆర్, 303 రైఫిల్, ఇన్‌సాస్ రైఫిల్, బీజీఎల్ లాంచర్లతోపాటు భారీఎత్తున ఇతర ఆయుధ వస్తు, సామాగ్రిని స్వాధీనపరుచుకున్నాయి. మృతి చెందిన మావోయిస్టుల్లో తెలంగాణ క్యాడర్‌కి చెందినవారు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ మీడియాతో మాట్లాడుతూ.. పక్కా సమాచారం మేరకే ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు జరిగిన ఎదురు కాల్పుల్లో 81 మంది మావోయిసులు మృతి చెందారు. సీపీఐ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మందమర్రి ప్రాంతానికి చెందిన బండి ప్రకాశ్(65) అలియాస్ బండి దాదా అలియాస్ ప్రభాత్ ఈ ఎదురు కాల్పుల్లో మృతి చెందినట్లు సమాచారం. అదిలాబాద్ ఏరియా కార్యదర్శి ఆదేలు భాస్కర్ కూడా మృతుల్లో ఉన్నట్లు తెలుస్తున్నది.

బీజాపూర్ హెడ్‌క్వార్టర్స్‌లో భద్రపర్చిన మావోయిస్టుల మృతదేహాలు, ఆయుధాలు

ఈ ఏడాది ఎన్‌కౌంటర్లలో 81 మంది నక్సల్స్ మృతి

- 20-21 జనవరి- గరియాబంద్ జిల్లాలో ఎన్‌కౌంటర్, 16 మంది నక్సలైట్ల మృతి
- జనవరి 16- ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని కంకేర్ పూజారి గ్రామంలో 18 మంది నక్సలైట్లు మృతి
- జనవరి 12 - బీజాపూర్‌లోని మాడెడ్ ప్రాంతంలోఇద్దరు మహిళా నక్సలైట్లతో సహా ఐదుగురు నక్సలైట్లు మరణం
- జనవరి 9- సుక్మా-బీజాపూర్ సరిహద్దులో ముగ్గురు నక్సలైట్లు మృతి
- జనవరి 6 - ఐఈడీ పేలడంతో 8 మంది జవాన్ల మరణం.
- జనవరి 4 - అబూజ్‌మడ్ అడవిలో ఎదురు కాల్పులు. ఒక మహిళ సహా ఐదుగురు నక్సలైట్లు మృతి, ఒక డీఆర్‌జీ జవాన్ మరణం. ఒక డీఆర్‌జీ జవాన్ మరణం.

ఏడాదిలో నక్సలిజం అంతం: అమిత్ షా

వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ కల్లా దేశంలో నక్సలైట్లను పూర్తిగా ఏరివేస్తామని, నక్సలిజం కారణంగా దేశానికి చెందిన ఏ ఒక్క పౌరుడూ మరణించడానికి వీల్లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.

కోతి కారణంగా శ్రీలంక అంతటా కరెంట్ కట్

కొలంబో, ఫిబ్రవరి 9: ఓ కోతి చేసిన పని వల్ల శ్రీలంక దేశమంతటా చీకట్లు అలుముకున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11.30 గంటలకు కొలంబో దక్షిణ ప్రాంతంలోని విద్యుత్తు వ్యవస్థలోకి ఎక్కడి నుంచో వచ్చిన ఓ కోతి చొరబడింది. ఈ కారణంగా దేశ వ్యాప్తంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇంజినీర్లు వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించే పనిలో పడ్డారు. సాయంత్రం అయిదు గంటల సమయానికి దేశంలోని కొన్ని ప్రాంతాలకు ఇంకా విద్యుత్తు సరఫరా అందలేదని ఇంజినీర్లు పేర్కొన్నారు. గ్రిడ్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఓ కోతి తాకడం వల్ల సరఫరా వ్యవస్థలలో అసమతుల్యత ఏర్పడిందని ఆ దేశ విద్యుత్తు శాఖ మంత్రి కుమార జయకోడి తెలిపారు. కోతి ప్రవేశం వల్ల జరిగిన నష్టం, డ్యామేజీని సరిదిద్దడానికి తమ ఇంజినీర్లు శ్రమిస్తున్నారని ఆయన వెల్లడించారు.

ఆ దుకాణాలకు కాపలా ఉండరు!

- నమ్మకమే నగదుగా అక్కడ వ్యాపారం
- కొన్న వస్తువులకు స్వచ్ఛందంగా చెల్లింపు
- నాగాలాండ్‌లోని పుత్సేరోలో అరుదైన విధానం

న్యూఢిల్లీ: మనుషులలో పరస్పర విశ్వాసం సన్నగిల్లి అడుగడుగునా సీసీటీవీ కెమెరాలు ప్రత్యక్షమవుతున్న ఇప్పటి రోజుల్లో నమ్మకమే నగదుగా చేసుకుని వ్యాపారం సాగిస్తున్న ఓ అరుదైన వాతావరణాన్ని నాగాలాండ్‌లో చూడవచ్చు. అక్కడి ప్రకృతే కాదు మనుషులు కూడా చాలా అందమైన మనసు కలవారని నిరూపిస్తున్నారు. నాగాలాండ్‌లోని నాగా పర్వతాలపైన ఉన్న పుత్సేరో పట్టణ శివార్లలో గల కొన్ని దుకాణాల వద్ద విక్రయదారులు ఎవరూ కనిపించరు. కష్టమర్లు తమకు నచ్చిన వస్తువులను తామే కొనుక్కుని దాని ధరను అక్కడ ఉన్న బాక్సులో వేయాల్సి ఉంటుంది. పండ్లు, కూరగాయలు, పచ్చళ్లు, జామ్‌లు, ఇతర నిత్యావసర వస్తువులను స్థానిక రైతులు అక్కడ దుకాణాలలో విక్రయిస్తారు. ప్రముఖ దర్శకుడు భరత్ బాలా ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించి మనుషుల పట్ల ఇంతగా నమ్మకాన్ని పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్న అక్కడి రైతులను చూసి ముగ్ధులయ్యారు. నాగాలాండ్ రాజధాని కోహిమా నగరానికి రోడ్డు మార్గంలో రెండు గంటలపాటు ప్రయాణిస్తే ఫేక్ జిల్లాలోని పుత్సేరో పట్టణం కనిపిస్తుంది. నమ్మకం బలమేమిటో ఆ ప్రాంతాన్ని చూసిన తర్వాత తనకు అర్థమైందని, క్యాషియర్ లేని, సెక్యూరిటీ లేని ఆ దుకాణాలు నమ్మకమే నగదుగా చేసుకుని వ్యాపారం సాగించడం అద్భుతమని భరత్ బాలా అన్నారు. అక్కడి దుకాణాలను చూసిన తర్వాత మనుషులపై నమ్మకం ఉన్న చోట మోసానికి తావుండదన్న సత్యం తనకు బోధపడిందని ఆయన చెప్పారు. పుత్సేరోలోని మూడు ప్రదేశాలలో ఇటువంటివి దాదాపు 20 దుకాణాల వరకు ఉన్నాయి. ఈ దుకాణాలన్నిటినీ మహిళా రైతులు నిర్వహించడం విశేషం. స్థానిక పొలాల్లో పండించే ఉత్పత్తులనే ఇక్కడ విక్రయిస్తారు. స్థానికంగా లభించే పండ్లతోనే జామ్‌లు తయారుచేసి ఈ దుకాణాలలో అమ్ముతున్నారు. నమ్మకం ఆధారంగా నడిచే దుకాణాలు కేవలం పుత్సేరోలో మాత్రమే కాదు మిజోరం, కేరళ స్కూళ్లలో కూడా ఇప్పుడు నడుస్తున్నాయి. పరస్పర అపనమ్మకంతో జీవించే నగరవాసులకు ఈ వాతావరణం వింతగా కనిపించవచ్చు కాని ఇక్కడి స్థానికులు మాత్రం నమ్మకమే తమ జీవన విధానంగా చేసుకున్నారు. ఈ షాపులలో నగదుతో పాటు యూపీఐ స్కానర్ ద్వారా కూడా తాము కొనుగోలు చేసిన వస్తువులకు కష్టమర్లు చెల్లింపులు జరిపే సౌకర్యం ఉండడం విశేషం.

మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ రాజీనామా

- బీజేపీ పాలిత ఈశాన్య రాష్ట్రంలో అనూహ్య పరిణామం
- బీరేన్‌పై సొంత పార్టీ నేతల్లోనే తీవ్ర అసంతృప్తి
- విపక్షాలు అవిశ్వాసానికి సిద్ధమవుతుండటంతో రాజీనామా

ఇంఫాల్: గత రెండేండ్ల నుంచి రావణ కాష్టంగా రగులుతున్న మణిపూర్‌లో అధికార పార్టీ బీజేపీలో అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి ఎన్ బీరేన్ సింగ్ ఆదివారం రాజీనామా చేశారు. సాయంత్రం తన రాజీనామా లేఖను ఆయన గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు అందజేశారు. ఆయన రాజీనామాను అంగీకరించిన గవర్నర్ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వరకు సీఎంగా కొనసాగాలని బీరేన్‌ను కోరారు. అయితే ఆయన స్థానంలో కొత్త ముఖ్యమంత్రిని నియమించేది, లేనిదీ బీజేపీ అధిష్ఠానం వెల్లడించ లేదు. ఈ పరిణామాల క్రమంలో సోమవారం నుంచి జరగాల్సిన అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ రద్దు చేశారు. కాగా, తన నాయకత్వంపై సొంత పార్టీలోనే ఏర్పడిన అసమ్మతిని చల్లార్చడానికి, సభలో తనపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉండటంతో బీరేన్ తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది. అయితే బీరేన్ నాయకత్వ మార్పును సొంత పార్టీలోనే పలువురు ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారు. ఈ సమయంలో సభలో నిర్వహించే విశ్వాస పరీక్షకు పార్టీ విప్ జారీ చేసినా చాలామంది ధిక్కరించే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా కేంద్రంతో చర్చించిన తర్వాత బీరేన్ సీఎం పదవికి రాజీనామా చేసినట్టు సమాచారం. 2023లో మేలో మణిపూర్‌లో తీవ్ర హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 250 మంది మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశాన్ని కుదిపేసింది. అల్లర్లను అదుపు చేయడంలో బీజేపీ ఘోరంగా విఫలమైందనే విమర్శలున్నాయి. రాష్ట్రంలో హింస సీఎం అనుమతితోనే జరిగిందంటూ ఇటీవల వెలువడిన ఒక ఆడియో క్లిప్‌ను విశ్లేషించి దాని ప్రామాణికతపై ఫోరెన్సిక్ నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని సుప్రీం కోర్టు గత వారం కేంద్రాన్ని ఆదేశించింది.

95% కాంగ్రెస్ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు

- ఢిల్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ ఘోర పరాభవం

న్యూఢిల్లీ: ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. మొత్తం 70 స్థానాల్లోనూ అభ్యర్థులను నిలిపిన ఆ పార్టీ.. కేవలం మూడు స్థానాల్లోనే డిపాజిట్లు దక్కించుకున్నది. 95 శాతం అభ్యర్థుల ధరావతులు గల్లంతయ్యాయి. 2015, 2020 ఎన్నికల్లో సున్నా సీట్లకే పరిమితమైన ఆ పార్టీ ఈ ఎన్నికల్లోనూ సున్నాతో హ్యాట్రిక్ నమోదు చేసింది. మరోవైపు ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని పార్టీల, స్వతంత్ర అభ్యర్థుల్లో 80 శాతం మందికీ డిపాజిట్ దక్కలేదు.

ఢిల్లీ సీఎం ఆతిశీ రాజీనామా

ఢిల్లీ సీఎం ఆతిశీ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఆమె ఎల్జీ సక్సేనాకు సమర్పించారని రాజ్‌నివాస్ వర్గాలు వెల్లడించాయి. ఆమె రాజీనామాను ఆమోదించిన సక్సేనా, కొత్త సర్కారు ఏర్పడే వరకు సీఎంగా కొనసాగాలని ఆమెను కోరారు. మరోవైపు గత(ఏడో) ఢిల్లీ శాసనసభను ఫిబ్రవరి 8న రద్దు చేస్తూ ఎల్జీ నిర్ణయం తీసుకున్నారు.

మోదీ అమెరికా నుంచి వచ్చాకే ఢిల్లీ సీఎం ప్రమాణం

ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ నూతన ప్రభుత్వ ఏర్పాటుకు తొందరపడటం లేదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 12, 13 తేదీల్లో అమెరికాలో పర్యటించి, తిరిగి వచ్చిన తర్వాతే కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

బ్రిడ్జి నిర్మించిన బీవర్స్.. ప్రభుత్వానికి 10 కోట్లు ఆదా

న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో ఆలస్యం జరిగితే, వాటి వ్యయ భారం పెరుగుతూ ఉంటుంది. కానీ చెక్ రిపబ్లిక్, బ్రిడీ రీజియన్‌లో ఓ ఆనకట్ట నిర్మాణంలో ఏడేళ్లు ఆలస్యమైనప్పటికీ, రూ.10 కోట్లు ఆదా అయింది. బీవర్స్ అనే ఎలుకల వంటి ఉభయచర జీవులు ఆనకట్ట నిర్మాణంలో సాయపడటమే దీనికి కారణమని అధికారులు చెప్పారు. ప్రాజెక్టు డాక్యుమెంటేషన్ వంటివేవీ లేకుండానే అవి తమ కోసం పని చేశాయన్నారు. ఈ ప్రాజెక్టు సుదీర్ఘ కాలం చెక్కుచెదరదని తెలిపారు. ఈ ఎలుకలు పుల్లలు, మట్టి, రాళ్లతో ఈ ఆనకట్టను నిర్మించాయి. ఇది వాటికి సహజంగానే ఉండే లక్షణం.

ఉద్యోగాల ఊచకోత

- ఈ సంవత్సరమూ భారీగా ఉద్యోగ కోతలు మొదలు
- వందల మందిని తొలగిస్తున్న టెక్నాలజీ కంపెనీలు
- గత నెలలో 49,795 మంది టెకీలకు ఉద్వాసన
- నేడు 3 వేల మందిని ఇంటికి పంపనున్న 'మెటా'
- బౌన్సర్లతో ఉద్యోగులను బయటకు పంపిన ఇన్ఫోసిస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: టెక్ కంపెనీల్లో గత నాలుగేండ్ల నుంచి అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్న ఉద్యోగ కోతలు (లేఆఫ్‌లు) ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. పునర్‌వ్యవస్థీకరణతోపాటు ఖర్చులను తగ్గించుకోవడం, పనితీరును మెరుగుపర్చుకోవడంలో భాగంగా ఈ యేడు కూడా కొలువుల్లో భారీగా కోతలు విధించనున్నట్టు ఇప్పటికే పలు అమెరికన్ కంపెనీలు ప్రకటించాయి. ఈ జాబితాలో మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా, గూగుల్, వాల్‌మార్ట్, సేల్స్‌ఫోర్స్, వర్క్‌డే, స్ట్రైప్ లాంటి దిగ్గజ కంపెనీలు ఉన్నాయి. వాటిలో కొన్ని కంపెనీలు ఈ ఏడాది జనవరిలోనే 49,795 మంది ఉద్యోగాలను కుదించాయి. ఇది 2024 డిసెంబర్‌లో తొలగించిన 38,792 ఉద్యోగాల కంటే దాదాపు 28% అధికం. అమెరికన్ రిటైల్ వ్యాపార దిగ్గజం 'వాల్‌మార్ట్' త్వరలో వందలాది ఉద్యోగులను తొలగించడంతోపాటు నార్త్ కరోలినాలోని కార్యాలయాన్ని మూసేయాలని, ప్రస్తుతం అందులో పనిచేస్తున్న సిబ్బందిని ఆర్కాన్సస్, కాలిఫోర్నియాలోని మినీ హబ్‌లకు తరలించాలని నిర్ణయించినట్టు ఉద్యోగులకు పంపిన ఇంటర్నల్ మెమోలో చీఫ్ పీపుల్ ఆఫీసర్ డోనా మోరిస్ స్పష్టం చేశారు. ఇదేవిధంగా త్వరలో దాదాపు 1,750 మంది ఉద్యోగులకు 'పింక్ స్లిప్పులు' ఇవ్వనున్నట్టు దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ 'వర్క్‌డే' ప్రకటించింది. గత నెల కమ్యూనికేషన్స్ విభాగంలో అమెజాన్ డజన్ల ఉద్యోగాలను తొలగించగా.. అంతర్జాతీయ ఐటీ సంస్థ 'మైక్రోసాఫ్ట్' పనితీరు ఆధారంగా ఉద్యోగులపై వేటు వేయడం ప్రారంభించింది.

మెటాలో నేడు 3 వేల మందిపై వేటు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ మొత్తం సిబ్బందిలో 5 శాతం మందిని తొలగించనున్నట్టు గత నెలలో ప్రకటించిన 'మెటా', ప్రధానంగా పేలవమైన పనితీరు కనబరుస్తున్న ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు సిద్ధమవుతున్నది. దాదాపు 3,600 మందిపై వేటు పడనున్నది. వీరిలో 3 వేల మందిని సోమవారమే ఇండ్లకు పంపనున్నట్టు ఆ కంపెనీ నుంచి లీకైన ఓ మెమో వెల్లడించింది.

గూగుల్‌లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం

టెక్ దిగ్గజం 'గూగుల్' నేరుగా ప్రకటించకపోయినప్పటికీ తన ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్ విభాగంలోని ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోమ్, నెస్ట్, ఫిట్‌బిట్ ఉత్పత్తుల సిబ్బందికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాన్ని ప్రవేశపెట్టింది. త్వరలో ప్రొడక్ట్, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ విభాగాల్లోని దాదాపు 300 మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు ప్రకటించింది.

బౌన్సర్లతో ఉద్యోగులను గెంటేసిన 'ఇన్ఫీ'

భారత్‌లోని అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన 'ఇన్ఫోసిస్' నిరుడు అక్టోబర్‌లో క్యాంపస్ నియామకాల ద్వారా చేర్చుకున్న 700 మంది ఉద్యోగులను బలవంతంగా గెంటివేసింది. అందుకోసం బౌన్సర్లను, సెక్యూరిటీ గార్డులను ఉపయోగించిందని, ఎలాంటి ముందస్తు నోటీసులు, నష్టపరిహారం ఇవ్వకుండా అన్యాయంగా ఉద్యోగులను తొలగించిందని ఐటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్ఐటీఈఎస్ (నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్) ఆరోపించింది. కార్మిక చట్టాలను ఉల్లంఘించడంతోపాటు ఉద్యోగులను బెదిరిస్తున్న 'ఇన్ఫోసిస్'పై వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర కార్మిక శాఖకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించింది.

నేటి నుంచి ఏరో ఇండియా-2025

మొదటిసారి ఒకే యుద్ధ విమానంలో ఆర్మీ, వాయుసేన అధిపతులు

బెంగళూరు : దేశీయంగా తయారైన భారత రక్షణ విమానాల పరాక్రమాన్ని ప్రదర్శించేందుకు..'ఏరో ఇండియా 2025' వేదిక కాబోతున్నది. సోమవారం బెంగళూరులో ఉదయం 10.20 గంటలకు వైమానిక ప్రదర్శనలు ప్రారంభమవుతున్నాయి. ఆదివారం యలహంక వైమానిక కేంద్రం వద్ద ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌లు ఇద్దరూ ఒకే తేజస్ ఫైటర్ నడిపారు. ఎయిర్ చీఫ్, ఆర్మీ చీఫ్‌లు ఇద్దరూ ఒకే యుద్ధ విమానాన్ని నడపటం ఇదే మొదటిసారి. తొలిసారిగా రష్యాకు చెందిన ఎస్‌యూ-57, అమెరికాకు చెందిన ఎఫ్-35 లైటినింగ్-2.. ఏరో ఇండియాలో పాల్గొంటున్నాయి.

గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ

గాజా: కీలకమైన గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ ఆదివారం నుంచి తన బలగాల ఉపసంహరణను ప్రారంభించింది. యుద్ధ సమయంలో మిలిటరీ జోన్‌గా వినియోగించిన నెత్జారిమ్ నడవా నుంచి తన బలగాలను ఉసంహరించడానికి ఇజ్రాయెల్ అంగీకరించింది. కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న అనంతరం వేలాది మంది పాలస్తీనావాసులు నెత్జారిమ్ ప్రాంతం నుంచి కాలినడకన, వాహనాల ద్వారా తమ ఇళ్లకు చేరుకోవడానికి ఇజ్రాయెల్ సైన్యం అంగీకరించింది. తాజాగా ఆదివారం ఇజ్రాయెల్ తన బలగాలను ఉపసంహరించడంతో కాల్పుల విరమణకు సంబంధించి రెండో విడత ఒప్పందంపై పురోగతి సాధించినట్టు కన్పిస్తుంది. ఇదే కనుక వాస్తవ రూపం దాల్చితే హమాస్ చేతిలో ఉన్న మరికొందరు బందీల విడుదలకు మార్గం సుగమమవుతుంది.

సూపర్ సానిక్ విమానాల పునరాగమనం?

- అమెరికా కంపెనీ బూమ్ ప్రయోగాలు
- కీలకమైన మొదటి దశ విజయవంతం
- 2029 నాటికి అందుబాటులోకి..

న్యూయార్క్, ఫిబ్రవరి 9: 20వ శతాబ్దం నాటి సూపర్‌సానిక్ విమానాలు మళ్లీ రానున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. అమెరికాకు చెందిన 'బూమ్' కంపెనీ సూపర్‌సానిక్ విమానం ఎక్స్‌బీ-1ను గతవారం విజయవంతంగా ప్రయోగించింది. 2003లో కాన్‌కార్డ్ సూపర్‌సానిక్ విమానం నిష్క్రమించిన తర్వాత ధ్వని కంటే వేగంగా ప్రయాణించిన మిలటరీ రహిత తొలి విమానం ఇదే కావడం విశేషం. 2029 నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో కీలకమైన మొదటి అడుగును బూమ్ విజయవంతంగా వేసింది.

సూపర్‌సానిక్ అంటే?

*విమానాల స్పీడ్‌ను మాక